# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 11-02-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. వ్యవసాయ అనుబంధ రంగాలలో వృద్ధి రేటును సాధించేందుకు చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
2. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ప్రతిపాదనలపై వివిధ శాఖల మంత్రులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఈరోజు చర్చిస్తున్నారు.
3. ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమ శాఖమంత్రి జి. సంధ్యారాణి స్పష్టం చేశారు.
4. బోదకాలు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు.
5. రహదారి ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

==========================

వ్యవసాయ అనుబంధ రంగాలలో వృద్ధి రేటును సాధించేందుకు చర్యలు చేపడుతున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన మంత్రులు, వివిధ శాఖల కార్యదర్శుల సమావేశాన్ని ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై అధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ పాలనలో కృత్రిమ మేధ వినియోగం పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అన్నారు. 2047 స్వర్ణాంధ్ర సాధన కోసం ప్రతీ సంవత్సరం 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామని ముఖ్యమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ ...38 సెకన్లు

--------------------------

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ ప్రతిపాదనలపై వివిధ శాఖల మంత్రులతో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ చర్చిస్తున్నారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈరోజు జలవనరులు, ఎక్సైజ్, గనులు,ఎస్సి, ఎస్టీ మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన మంత్రులు.. ఆయా శాఖల కార్యదర్శులతో మంత్రి సమావేశాలను నిర్వహిస్తున్నారు. కాగా నిన్న మంత్రులు నిమ్మల రామానాయుడు, డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి, జి. సంధ్యారాణి, ఫరూక్, కొల్లు రవీంద్రలతో ఆర్థికమంత్రి సమావేశాలను నిర్వహించారు. ప్రభుత్వ ప్రాధాన్యాలు,

మేనిఫెస్టో హామీలు, వాటి అమలుకు కేటాయింపులు వంటి అంశాలపై, సమగ్ర ప్రతిపాదనలపై వారు చర్చించారు.

---------------------------

ఆదివాసీ చట్టాల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న 1/70 చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం మార్చడం లేదని ఒక ప్రకటనలో తెలిపారు. గిరిజనులకు మెరుగైన ఉపాధి అవకాశాలు అందేలా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. వారికి మెరుగైన సంక్షేమం అందిస్తూ వారి జీవన ప్రమాణాలు మెరుగు పరిచే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని అన్నారు. ఆదివాసీ చట్టాలను అమలు చేయడానికి కృతనిశ్చయంతో ఉన్నామని, గిరిజనులెవరూ ఆందోళన చెందవద్దని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరీక్షా పే చర్చా కార్యక్రమం పరీక్షల ఒత్తిడిని దూరం చేసిందని బాపట్ల జిల్లా చీరాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంపై తమ అభిప్రాయాలను తెలియజేస్తూ, విద్యార్థులకు ఒత్తిడి లేని పరీక్ష విధానం, భవిష్యత్ లక్ష్యాల పై ఇచ్చిన సూచనలు, సలహాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు.

వాయిస్ ...28 సెకన్లు

---------------------------

బోదకాలు వ్యాధి నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. బోదకాలు వ్యాధిగ్రస్తులకు సామూహిక మందుల పంపిణీ కార్యక్రమాన్ని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా దృశ్యమాధ్యమం ద్వారా ప్రారంభించారు. దేశవ్యాప్తంగా 2030 నాటికి బోదకాలు వ్యాధి విస్తరణ నివారణలో భాగంగా 13 రాష్ట్రాల్లోని 111 జిల్లాల్లో ఈ వ్యాధి నిరోధక మందుల పంపిణీని చేపట్టారు. ఈ కార్యక్రమంలో అమరావతి నుంచి మంత్రి పాల్గొన్నారు. అలాగే ఆయా రాష్ట్రాల ఆరోగ్య మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

---------------------------

రహదారి ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన వాక్ థాన్‌ను మున్సిపల్ కమిషనర్ ధ్యాన్ చంద్రతో కలిసి ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులు హెల్మెట్ ను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వాహనాలు నడిపే వారు విధిగా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని తెలియజేస్తూ,

వాయిస్ ..30.. సెకన్లు

---------------------------

పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఉన్నత విద్యా సంస్థల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక క్లబ్ –ఈగల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు, విద్యాసంస్థల్లో ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ప్రోత్సహించేందుకు వీటిని ఏర్పాటు

చేస్తున్నట్లు పేర్కొంది. ఇవి విద్యా సంస్థల్లో మత్తుపదార్థాల వినియోగం లేకుండా చూడడం, వాటి వల్ల కలిగే ఇబ్బందులపై సదస్సులు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటివి చేస్తాయని పేర్కొంది.

----------------------------

ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని శ్రీకాళహస్తి డిఎస్పి కె.నరసింహమూర్తి తెలిపారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, రోడ్డు భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. రహదారి ప్రమాదాల్లో అధిక మరణాలు హెల్మెట్ ధరించకపోవడం వల్లనే సంభవిస్తున్నాయని, వీటిపై పలు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

----------------------------

మానవ జాతిని ప్రభావితం చేసిన విద్యుత్ బల్బు ఫోనోగ్రాఫ్ లాంటి అనేక ఉపకరణాలను కనుగొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త థామస్ ఆల్వా ఎడిసన్ జయంతి ఈరోజు. తన ఆవిష్కరణలతో సమాజం రూపురేఖలనే మార్చివేసిన ఆయన 1847 ఫిబ్రవరి 11వ తేదీన అమెరికాలోని మిలాన్‌లో జన్మించారు. ఆవిరి యంత్ర దశ నుండి విద్యుత్ కాంతుల్లోకి, నాగరికత పయనించడానికి ఎడిసన్ పరిశోధనలే కారణం. 13 వందల ఆవిష్కరణలపై పేటెంట్ హక్కులు పొందిన ఆయన 1931 అక్టోబర్ 18వ తేదీన కన్నుమూశారు.

----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 35 సెకన్లు....

----------------------------

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల అభివృద్ధి పనులు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. పార్వతీపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఉపాధి హామీతో పాటు ఇతర అంశాలపై నిన్న ఆయా శాఖ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధి హామీ కింద చెరువులు, నీటి నిలువ కట్టడాలు, కాలువల పూడికతీత వంటి పనులతో 90 రోజుల పని దినాలను కల్పించాలని చెప్పారు.

======================